క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే దోమలకు అడ్డుకట్ట

కడప రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే దోమలకు అడ్డుకట్ట వేయవచ్చని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ జమాల్‌బాష అన్నారు. శుక్రవారం మాసాపేటలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను డాక్టర్ జమాల్‌బాష పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారానికి ఒకసారి ప్రతి ఇంట్లో కుండలు, బానలు వంటి వస్తువులను శుభ్రం చేసుకోవాలన్నారు. సాయంత్రం వేళల్లో ఇంటి కిటికీలు వేసుకోవాలని పేర్కొన్నారు. పరిశుభ్రతతోనే దోమలను నిర్మూలించవచ్చని, తద్వారా మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నిత్యపూజయ్య, సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి, ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇస్మాయిల్ మృతి



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్(72) శుక్రవారం కన్నుమూశారు. నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రాజాఖాన్ బాగ్ మసీదు వెనుక తన స్వగృహంలో మృతిచెందారు. ఈయన భార్య సయ్యద్ నూర్జహాన్ 2004లో కాంగ్రెస్ పార్టీ తరుపున కార్పొరేటర్‌గా పనిచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించిన తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇస్మాయిల్‌కు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు మదీహాస్ మాస్కులో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన మృతదేహాన్ని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు మున్నా తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయండి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని పాత రియాజ్ థియేటర్ సమీపంలో లోహియానగర్ క్రాస్ రోడ్డు వద్ద అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని బేడ బుడగ జంగం జిల్లా అధ్యక్షుడు ధూపం రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన లోహియా నగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 16వ తేదీన లోహియా నగర్‌కు చెందిన పుల్లయ్య అనే వృద్ధుడు రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ యువకుడు వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయారని తెలిపారు. తలకు బలమైన గాయంతోపాటు పక్కటెముకలు విరిగాయని, ఆయన ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఈ ప్రాంతంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు ఉన్నారని, అలాగే చెత్త కాగితాలు ఏరుకునేవారు అధికంగా ఉన్నారన్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మున్సిపల్ స్కూల్ తనిఖీ



ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్. మాధవి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఆగాడి స్ట్రీట్‌లో ఉన్న మున్సిపల్ ఉర్దూ హై స్కూల్‌ను ప్రభుత్వ విప్,కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి తనిఖీ చేశారు. ఇటీవల ప్రజాదర్బార్‌లో తనకు వచ్చిన ఫిర్యాదులపై ఆమె శుక్రవారం ఆ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. అక్కడున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట డీఈఓ షంషుద్దీన్, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌లో చేరిక



శేషగిరిరావుకు కండువా కప్పి యూటీఎఫ్‌లో చేర్చుకుంటున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడపలోని యూటీఎఫ్ భవన్‌లో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబుల ఆధ్వర్యంలో ఒక ఉపాధ్యాయ సంఘంలో జిల్లా నేతగా పనిచేస్తున్న పసుపుల శేషగిరి యూటీఎఫ్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల మంచి అవగాహన, ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించే శేషగిరి రావు యూటీఎఫ్‌లో చేరడం మంచి పరిణామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాతరాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరి, పెండ్లిమర్రి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సుబ్బారావు, కె.సూర్య కుమార్, కడప నగర ప్రధాన కార్యదర్శి హిఫాజుతుల్లా, నాయకులు శివ శంకర్ లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం

– మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
– 1, 4, 7, 15, 28 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



28వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: జిల్లా అయినా, కడప నగరమైనా అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమని మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం 1, 4, 7, 15, 28 డివిజన్లలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలైనా కడప నగరాభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉందని, అప్పుడు కూడా కడప నగరాభివృద్ధికి నయాపైసా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. అప్పట్లో ఆలంఖాన్‌పల్లెలో ఒక కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు రూ.2 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చి...అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ నిధులు విడుదల చేయలేదని గుర్తు చేశారు. వైఎస్సార్ జిల్లా అంటే చంద్రబాబుకు కడుపు మంట అని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం ఆయనకు ఇష్టం లేదని తెలిపారు. అందుకే జిల్లాలో ఏ ఒక్క కొత్త ప్రాజెక్టు చేపట్టలేదని, ఏ అభివృద్ధి పనిని ప్రారంభించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, కార్పొరేషన్ జనరల్ ఫండ్‌తోనే అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు వాస్తవాలు గుర్తించి కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, మల్లీశ్వరి, అరీఫుల్లా బాషా, డివిజన్ ఇన్‌చార్జులు ఆర్‌వీ రమణ, సీహెచ్ వినోద్, పార్టీ నాయకులు బీహెచ్ ఇలియాస్, రామ్మోహన్‌రెడ్డి, దాసరి శివప్రసాద్, పవర్ అల్తాఫ్, కె. బాబు, టీపీ వెంకట సుబ్బమ్మ, బి. మరియలు, సుజిత, మల్లీశ్వరి, శ్రీదేవి, శివమ్మ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి

కడప అర్బన్: కడప నగరంలోని ఫ్లెక్సీ తయారీ యజమానులు, ప్రింటింగ్ ప్రెస్ వాళ్లు అప్రమత్తంగా వ్యవహరించాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కడప డీఎస్పీ కార్యాలయంలో ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్స్ దుకాణదారులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా దుకాణ ధరలు ఫ్లెక్స్ ప్రింట్ చేసే ముందు నగరపాలక సంస్థ వారి వద్ద చలాన్ కట్టి ఉండి ఇతరులను, ఒక జాతిని, పార్టీలను కించపరచని విధంగా వుంటే ప్రింట్ చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒకటవ పట్టణ సీఐ రామకృష్ణ , పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లు



రోడ్డుకు అడ్డుగా పడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు

వల్లూరు : మండల పరిధిలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో రెండు చెట్లు విరిగి రోడ్డుకు అడ్డుగా పడిపోవడంతో వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బందులు తలెత్తాయి. శుక్రవారం తెల్లవారుజామున బలమైన గాలులు వీచడంతో హైవే పక్కన వున్న రెండు చెట్లు విరిగి రోడ్డుకు అడ్డుగా పడిపోయాయి. చెట్టు విరిగి పడిన విషయాన్ని గమనించక పోవడంతో తెల్లవారుజామున కమలాపురం వైపు నుంచి కడపకు వెళుతున్న ఒక ఆటో స్వల్పంగా దెబ్బతిన్నట్లు తెలెస్తోంది. సమాచారం అందుకున్న వల్లూరు పోలీసులు ఉదయాన్నే అక్కడికి చేరుకుని రోడ్డుకు అడ్డుగా వున్న చెట్లను తొలగించడానికి చర్యలు చేపట్టారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్



కడప అర్బన్ : కడప నగరం పాత కడప చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను శుక్రవారం రాత్రి చిన్నచౌకు పోలీసులు సీజ్ చేశారు. అనుమతులు లేకుండా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా పోలీసులు వాటిని సీజ్ చేసి చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

రిమ్స్‌లో సమస్యలు పరిష్కరించాలి



రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ రంగ స్వామికి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగర పరిధిలో ఉన్న రిమ్స్ లో సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన చేయక తప్పదని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ హెచ్చరించారు. శుక్రవారం రిమ్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నేతలు రిమ్స్ అడ్మినిస్టేటర్ రంగ స్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ లో విద్యుత్ నియంత్రణ కోసం రూ. 75 లక్షలు ఖర్చు పెట్టిన ప్యానెల్ బోర్డు గత ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉందన్నారు. విద్యుత్ వినియోగం పెరగడం వల్ల నియంత్రణ కోసం ప్యానల్ బోర్డు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. లిఫ్ట్ ఆగిపోవడం, ఆపరేషన్ థియేటర్లో కరెంట్ హెచ్చు, తగ్గులు రావడం, వెంటిలేటర్లు సక్రమంగా పనిచేయకపోవడం, బాటరీలు దెబ్బ తినడం లాంటి సమస్యలు లేకుండా పోతాయన్నారు. కాబట్టి దాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రిమ్స్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పేషెంట్లు, సంబంధీకులు మంచినీటి సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు, నీటి పైపుల లీకేజీ, దెబ్బతిన్న గోడలను బాగు చేయడం లాంటి సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉందని, దాన్ని రిపేర్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కడప కార్పొరేషన్ నుంచి రిమ్స్ కు అందాల్సిన నీటిని సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి, నరసింహ, మధు పాల్గొన్నారు.

శక్తి యాప్ సేవలు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శక్తి టీం ఎస్ఐ శాంతమ్మ

కడప ఎడ్యుకేషన్: మహిళలు, బాలికలు శక్తి యాప్ సేవలు వినియోగించుకుని పోలీసు భద్రత పొందాలని ఈ యాప్ ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ పేర్కొన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి శుక్రవారం కడప నగరంలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత. రక్షణకు శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చిందన్నారు. ప్రతి మహిళ, విద్యార్థులు, బాలికలు సెల్‌ఫోన్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు ఫోన్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్.ఓ.ఎస్ బటన్, డయల్ 112 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయగా పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకొని మీ సమస్యను , ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. మహిళలు , చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల పై డయల్ 100, 112, చైల్డ్ లైన్ 1098, గృహహింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర తదితర వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘చలో విజయవాడ’ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్క్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బండి రామలింగారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న చేపడుతున్న ఛలో విజయవాడను జయప్రదం చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్క్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బండి రామలింగారెడ్డి, ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలోని నిర్వాహక ప్రమాదాలు, కార్మిక హక్కులపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనే లక్ష్యంతో ఏఐటీయూసీ అనుబంధ విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 21న విజయవాడలో ‘చలో విద్యుత్ సౌధ’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున కదలబోతున్న ఈ ఉద్యమం సాధారణ నిరసన కాదని, ఇది విద్యుత్ ఉద్యోగుల జీవన భద్రత, ఉద్యోగ భవిష్యత్తు కోసం జరుగుతున్న సంఘటిత పోరాటం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఔ.నాగ సుబ్బారెడ్డి, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. బ్రహ్మానందరెడ్డి. బిల్ లీడర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున, ప్రతాపరెడ్డి, దస్తగిరి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పాయింట్‌కే బియ్యం సరఫరా చేయాలి



డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంకు సంబంధించిన సన్న బియ్యాన్ని స్కూల్ పాయింట్‌కు సరఫరా చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓను కలిసి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మధ్యాహ్న భోజనంకు సన్నబియ్యం సరఫరా చేయడం సంతోషమేనని అయితే ఆ సన్న బియ్యం స్కూల్ పాయింట్‌కు చేర్చకుండా మండల లేదా క్లస్టర్ స్థాయి పాఠశాలకు చేరుస్తున్నారని అన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులకు అక్కడికి వెళ్లి బియ్యాన్ని తెచ్చుకోవాలంటే ఇబ్బందికరంగా ఉందని వాపోయారు. పాఠశాల పాయింట్‌కి బియ్యం చేర్చేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్ టి యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డితోపాటు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష, ఆర్థిక కార్యదర్శి రామమోహన్, ఎస్టీయూ సీనియర్ నాయకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







చినుకు పడితే అంతే..

కడప నగరంలో శుక్రవారం తెల్లవారుజామున కొద్దిపాటి వర్షం కురిసింది. ఈ వానకే పాతకడప రోడ్లు ఇలా దర్శనమిస్తున్నాయి. పాత కడప నుంచి నానా పల్లె కు వెళ్లే రహదారిలో కూడా బురద మయం అయ్యాయి. కార్పొరేషన్ పరిధిలోని 2, 3 డివిజన్లలో కూడా కొన్ని చోట్ల పరిస్థితి ఇలానే ఉంది. – ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కడప



ఎక్కడి చెత్త అక్కడే

జిల్లా కలెక్టర్ మొదలుకొని జిల్లా స్థాయి అధికారులంతా నిత్యం ఉండే కలెక్టర్ కార్యాలయం చెత్తాచెదారంతో నిండిపోయి తీవ్ర అపరిశుభ్రంగా మారింది. కలెక్టరేట్‌లో ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఆ చెత్తా చెదారాన్ని కాల్చిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధింత సిబ్బంది ఈ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప





అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి



మాట్లాడుతున్న కడప జోన్ ఈడీ పైడి చంద్రశేఖర్

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ చంద్రశేఖర్ మాట్లాడుతూ కొంతమంది డ్రైవర్లు ప్రయాణీకులపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, కొంతమంది బస్సు నడిపేటప్పుడు ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. కడప డిప్యూటీ సీఎంజీ ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించాలని, అలా పాటించడంవల్ల అదనంగా కేఎంపీఎల్ పెరుగుదల ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ ఓంశాంతి ప్రదీప అక్కయ్య డ్రైవర్లకు మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయించారు. అనంతరం 30మంది డ్రైవర్లను బ్లాక్ స్పాట్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్‌డీఐలు కృష్ణారెడ్డి, ఎస్ఎంఏజీ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రవ్యాప్తంగా ‘ప్రత్యేక హోదా’ కోసం విభజన చట్టం హామీలు అమలు చేయాలని అందులో భాగంగా కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం నామమాత్రంగా కాకుండా ‘సెయిల్’ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో నిర్మించాలని డిమాండ్ తో నిరసన తెలపటానికి కడప జిల్లా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంపర్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా డీసీసీ మాజీ అధ్యక్షులు–నజీర్ అహ్మద్, ఏఐసిసి కోఆర్డినేటర్ ఎస్ ఏ సత్తార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విభజన చట్టాన్ని, హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు పూర్తిస్థాయిలో అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాసిర్ హుస్సేన్, నాసిర్ ఖాన్, ఆరిఫ్, కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి, నాగ రత్నమ్మ, అక్రమ్, అన్వర్, హబీబ్, గంగాధర్, చాన్ బి, తాజుద్దీన్ తదితరులు వెళ్లారు.

వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం తగదు

కడప రూరల్: బోయ, వాల్మీకి వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చడం తగదని గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి సౌరకాయల శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయం నిజమైన ఆదివాసీల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఆ వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చడం తగదని తెలిపారు.

పీజీ పరీక్షల తనిఖీ



పరీక్షా కేంద్రంలో విద్యార్థి హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు తనిఖీ చేశారు. వైవీయూ పీజీ కళాశాల కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి పరీక్షా కేంద్రంలో వసతుల గురించి ఆరా తీశారు. పరీక్షల నిర్వహణలో తీసుకుంటున్న జాగ్రత్తలను చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కాత్యాయిని ఆయనకు వివరించారు.

విద్యార్థులకు అసౌకర్యం కలగకూడదు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అధికారులకు, సిబ్బందికి ఆదేశాలిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన వసతి గృహాలను, మెస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య ఏదైనా ఉందా అని ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలానే స్కాలర్ల హాస్టల్, మెస్సును కూడా పరిశీలించారు. కొందరు విద్యార్థులు వారంలో ఒకరోజు మెస్‌లో భోజనం చేసినా అన్ని రోజులకు బిల్లు వస్తోందని, తద్వారా తమకు ఆర్థిక సమస్య ఎదురవుతోందని వీసీ దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని వారికి హామీ ఇచ్చారు. వైస్ ఛాన్సలర్ వెంట వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్, వసతి గృహాల చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైవీయూ డాక్టర్ వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, సమన్వయకర్త డాక్టర్ రెడ్డయ్య, వార్డెన్లు ఉన్నారు.